క్లుప్తంగా

మణిపూర్ నిందితులను శిక్షించాలి



కర్లపాలెం: మణిపూర్ మారణకాండకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం కర్లపాలెం సెంటర్‌లో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దోషులను వెంటనే అరెస్టు చేసి, శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సువర్చలకు సన్మానం



నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సువర్చల అందించిన సేవలు అభినందనీయమని నల్లమోతువారి పాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర వెంకట సాంబశివరావు అన్నారు. నల్లమోతువారి పాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ.. ఇటీవల పేరలి గ్రామ పంచాయతీకి స్థాన చలనం పొందిన ఆమెను మంగళవారం స్థానిక సచివాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడారు. కరోనా వైరస్ విజృంభించిన సమయంలో సువర్చల మెరుగైన సేవలందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమ్మెటవారిపాలెం సర్పంచ్ పిట్టు నాగాంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు బేసాబత్తుని గోపీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మా మంచి మస్టారు..



కర్లపాలెం: యాజలి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు చెప్పిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దెందుకూరి కృష్ణంరాజు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన 89వ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక పాఠశాలలో 1982–83, 1983–84 బ్యాచ్ విద్యార్థులు తమ మాస్టారు కృష్ణంరాజును ఆయన స్వగ్రామం పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంలోని ఇంటికి వెళ్లి.. సన్మానించారు. కేక్ కట్ చేయించి, పాద పూజ చేశారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షం..ఆగిన మగ్గం



భట్టిప్రోలు: అల్ప పీడన ప్రభావం కారణంగా ఏకధాటి వర్షం కురుస్తుండటంతో చేనేత వాడల్లో మగ్గం పనులు నిలిచిపోయాయి. వారం రోజులుగా చేనేత మగ్గాలు ముందుకు కదలడం లేదు. మండలంలోని ఐలవరం, అద్దేపల్లి, భట్టిప్రోలు, కోనేటిపురం గ్రామాల్లో సుమారు వెయ్యి కుటుంబాలు చేనేత పరిశ్రమనే నమ్ముకుని జీవిస్తున్నాయి. ప్రతి చేనేత మగ్గంపై పది మంది అనుబంధ కార్మికులు పని చేస్తున్నారు. ఎక్కువ శాతం గుంత మగ్గాలు కావడం వల్ల నేతకు వాతావరణం అనుకూలించట్లేదు. స్టాండ్ మగ్గాలైతే కొంతమేర ఫర్వాలేదు. చేనేత పనికి వర్షం వచ్చినా, చలి ప్రభావం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా కూడా ఆటంకం తప్పదు. వర్షం తెరపిచ్చి ఎండ వస్తేనే చేనేత మగ్గాలు ముందుకు కదులుతాయని చేనేత కార్మికులు చెబుతున్నారు.

కార్గిల్‌లో పేలిన చందోలు 'రైఫిల్'

అమరవీరుని స్మృతిలో..

వీరులే యుద్ధానికి వెళ్తారు..
వీరులే మెరుపులై మెరుస్తారు..
వీరులే పిడుగులై కురుస్తారు..
వీరులే అమరులై నిలుస్తారు..
దేశ సేవలో పునీతమైన ఓ యువకుడు కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొంది రెండు దశాబ్దాల కాలం పూర్తయింది. శత్రు సైన్యంతో పోరాడుతూ..అమరుడైన హాజీ బాషాపై, సిపాయిలకు పుట్టినిల్లు చందోలు గ్రామంపై బుధవారం కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- కార్గిల్ అమర వీరుడు హాజీబాషాకు జోహార్లు
- నేడు కార్గిల్ విజయ దినోత్సవం
- దేశ సేవకు సిపాయిలను అందించిన చందోలు గ్రామం





చందోలు గ్రామ ముఖ చిత్రం (ఇన్‌సెట్) హాజీబాషా(ఫైల్‌ఫోటో)

చందోలు (పిట్టలవానిపాలెం): పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో 1975లో అబ్దుల్ రెహ్మాన్, ముంతాజ్ బేగంలకు జన్మించిన హాజీ బాషా, తమ పెద్దల స్ఫూర్తితో ఇరవై ఏళ్లకే.. 1993లో సైన్యంలో చేరారు. 110 ఇంజినీర్ రెజిమెంట్ బొంబాయి ఇంజినీరింగ్ గ్రూపులో 17వ బెటాలియన్ గార్విల రైఫిల్స్‌లో పని చేశారు. ఆపరేషన్ విజయ్ పేరుతో 1999లో జరిగిన కార్గిల్ పోరాటంలో వీర మరణం పొందారు. దీంతో అతని తండ్రి రెహామన్ దిగులు చెంది మంచాన పడి ఏడాదిలోపే మరణించారు. హాజీ బాషా తమ్ముడు ఎనిమిదేళ్ల వయసులోనే మొదడు వాపు వ్యాధితో చనిపోయారు.

సిపాయిలకు పుట్టినిల్లు చందోలు..

పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామాన్ని సిపాయిల పుట్టినిల్లుగా చెప్పవచ్చు. ఈ గ్రామం నుంచి వందలాది మంది దేశ సేవ కోసం సిపాయిలుగా పనిచేసిన వారు, చేస్తున్న వారు అనేక మంది ఉన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ గ్రామానికి చెందిన వారు మొదటి ప్రపంచ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. అదేవిధంగా సిపాయి స్థాయి నుంచి హవల్దార్, నాయక్ మేజర్ లాంటి హోదాల్లో కొందరు పనిచేశారు. ఇప్పటికే పదవీ విరమణ చేసిన విశ్రాంత సైనికులు వందల సంఖ్యలో ఉన్నారు. ప్రతి ఇంటి నుంచి ఆర్మీలో పనిచేస్తున్న సైనికులు ఉన్నారంటే ఆశ్చర్య పోక తప్పదు. ఇప్పటికీ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ రాష్ట్రంలో ఎక్కడ జరిగినా అందులో అధిక శాతం మంది చందోలు యువకులే ఉంటారు.

వాగ్దానం మరచిన పాలకులు..

దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన హాజీ బాషా చిహ్నంగా చందోలు గ్రామంలో హాజీ బాషా స్మారక స్థూపం నిర్మిస్తామని అప్పట్లో పాలకులు హామీ ఇచ్చారు. ఇది జరిగి 20 ఏళ్లు పూర్తయినా నేటికీ ఆ మాటను నెరవేర్చేవారు కనిపించడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆ అమర వీరుడి స్మారక స్థూపం నిర్మించి, కార్గిల్ వీరునికి నిజమైన నివాళులర్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హాజీ బాషా స్మారక స్థూపం ఏర్పాటు చేయాలి



దేశ సేవలో ఉండి కార్గిల్ పోరులో వీర మరణం పొందిన హాజీ బాషా స్మారక స్థూపాన్ని చందోలులో ఏర్పాటు చేస్తామని అప్పట్లో నేతలు హామీ ఇచ్చారు. అయితే నేటి వరకు ఆ హామీ నెరవేరలేదు. ఇప్పటికైనా నేతలు మాట నిలబెట్టుకోవాలి.
–రియాజ్, చందోలు.

నీటి పథకానికి హాజీ బాషా పేరు పెట్టాలి



కార్గిల్ వీరుడు హాజీ బాషా పేరును రక్షిత మంచినీటి పథకానికి పెడతామని అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే నేటి వరకు ఎలాంటి స్పందనా లేదు. పాలకులు ఇప్పటికైనా స్పందించి హాజీ బాషాను స్మరించుకుంటూ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.
–మస్తాన్‌బేగ్, చందోలు.

సంక్షేమం కోసం పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలు–2, పల్లెకోనలో 'జగనన్న సురక్ష' శిబిరాలు



అద్దేపల్లిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు/పల్లెకోన: ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కోరారు. భట్టిప్రోలు–2, పల్లెకోన సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. భట్టిప్రోలు–2 పరిధిలోని అద్దేపల్లి షాదీఖానాలో జరిగిన శిబిరంలో మంత్రి నాగార్జున పాల్గొని, మాట్లాడారు. జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయని చెప్పారు. ప్రజాభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రికి ప్రజలు వెన్నుదన్నుగా ఉండాలని కోరారు. సాంకేతిక లోపాల వల్ల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులను, వలంటీర్లను అడిగి తెలుసుకుని, సత్వరమే పరిష్కరించేందుకు ఆదేశాలు ఇచ్చారు. భట్టిప్రోలు–2లో 1,358, పల్లెకోనలో 2,092 ధ్రువీకరణ పత్రాలను అర్జీదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచులు దారా రవికిరణ్మయి, బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, జయవరపు రాధాకృష్ణమూర్తి, పెద్దిశెట్టి రాంబాబు, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాదు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ కొతరపు పద్మావతి, తహసీల్దారు డి.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, పట్టణాధ్యక్షుడు కుందేటి రమేష్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, జగనన్న సురక్ష మండల ప్రత్యేక అధికారి వినోద్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కొతరపు శ్రీనివాసరావు, కొలుసు దుర్గాభవాని, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వెళ్లిన కూలీని..పొట్టన పెట్టుకున్న బొగ్గు లారీ



లారీని పక్కకు తొలగించడంతో.. శంకరరావు మృతదేహం వద్ద స్థానికులు

కొల్లూరు: పొట్టకూటి కోసం కూలికి వెళ్లిన అరవై ఏళ్లు దాటిన వృద్ధుడిని మృత్యువు బొగ్గులారీ రూపంలో పొట్టన పెట్టుకుంది. ఈ విషాద ఘటన మండలంలోని తురకపాలెంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తోలకవారి పాలెం శివారు తురకపాలెం వద్ద గంగిరెడ్డి కృష్ణారెడ్డి అనే వ్యక్తికి చెందిన ఇటుక బట్టీకి.. కటక్ నుంచి వచ్చిన లారీలోని బొగ్గును అన్‌లోడ్ చేసేందుకు తోటి కూలీలతో కలసి పోతార్లంకకు చెందిన పానమాల శంకరరావు (64)వెళ్లాడు. వర్షాల కారణంగా ఇటుకల బట్టీ ప్రాంతంలో నానిపోయి ఉన్న మార్గంలో వెళ్లిన లారీ.. చక్రాలు పక్కకు దిగబడి పల్లపు ప్రాంతంలోకి పల్టీ కొట్టింది. దీంతో లారీలోని బొగ్గుపై కూర్చుని ఉన్న శంకరరావు ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు కిందకు దూకేశాడు. కానీ, వెల్లకిలా పడిన లారీ తిరిగి ఓ పక్కకు లేచి శంకరరావుపై పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్ కింద చిక్కుకుని అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి ముందు లారీపై నుంచి మృతుడితో పాటు బొగ్గు అన్‌లోడింగ్ కోసం వచ్చిన మరో ఇద్దరు కూలీలు కొక్కిలిగడ్డ ఏసుబాబు, కొల్లూరు మాణిక్యరావు ముందే దిగిపోవడంతో.. ప్రాణాలతో బయట పడినట్లయ్యింది. లారీ క్యాబిన్‌లో చిక్కుకుపోయిన విజయవాడకు చెందిన డ్రైవర్ షేక్ బాషా, క్లీనర్ దేవరపల్లి జగదీష్‌ను ఇతర కూలీలు కాపాడి, 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొల్లూరు ఎస్‌ఐ జి. రాజ్యలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రొక్లెయిన్ సాయంతో లారీని తొలగించి, మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు. కూలీ నగదుతో భార్యను పోషించుకుంటున్న శంకరరావు మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుడి భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



కాల్వలోకి దూసుకెళ్లిన కారు

గుంటూరు రూరల్: మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని, పక్కనే ఉన్న కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న కారు మితిమీరిన వేగంతో ఓబులునాయుడుపాలెం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిలకలూరిపేట మండలం పసుమర్తి గ్రామానికి చెందిన మర్రి సుబ్బారావు తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై నడుస్తున్న మరో వ్యక్తినీ కారు ఢీకొంది. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. కారు వేగాన్ని గమనించిన ఓ బాలిక, వృద్ధులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అప్పటికీ ఆగని కారు పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. కాలువలో నీరు లేకపోటంతో ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి, గాయపడిన సుబ్బారావును చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆసుపత్రికి తరలించారు. కారును, అందులోని డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ ప్రమాదంపై నల్లపాడు పోలీసులు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

భట్టిప్రోలు: గత ఐదు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, గాలులకు రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చుండూరు, భట్టిప్రోలు మండలాల విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈలు దోనేపూడి అర్జునరావు, ఏడుకొండలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలాల్లోని మోటార్లు, స్టార్టర్స్, డబ్బాలు తడిసి ఉంటాయని తెలిపారు. సర్వీస్ వైర్లు దెబ్బతింటాయని, విద్యుత్ స్తంభాలు పడిపోయి వైర్లు తెగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో వాటిని ముట్టుకోనే ప్రయత్నం చేయవద్దని పేర్కొన్నారు. ఆక్వా రైతులు ఏరియేటర్స్‌ను ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ సమస్యలు ఉంటే ఆ ప్రాంత లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, సబ్ స్టేషన్ ఏఈ దృష్టికి లేదా 1912 కాల్ సెంటరుకు తెలియజేయాలని సూచించారు.

బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటుకు పరిశీలన



తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఇక్కడి కొత్తపేటలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.70 లక్షలను వెచ్చించనున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఆ ప్రదేశాన్ని సందర్శించారు. రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా పట్టణ, పరిసరాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో రక్తం సమకూర్చేందుకు రెడ్‌క్రాస్ రక్తనిధిని ఏర్పాటు చేయనున్నట్టు చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ వెల్లడించారు. రక్తనిధి ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు తోడ్పడవచ్చని చెప్పారు. రక్తనిధి ఏర్పాటుకు తమ సమావేశంలో తీర్మానించిన విషయాన్ని తెలియజేసిన వెంటనే ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పందించారని రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి చెప్పారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఒక గదిని ఇందుకు నిర్ణయించినట్టు ఎమ్మెల్యే తెలియజేశారని చెబుతూ ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. వీరితో మున్సిపల్ ఏఈ ఫణీంద్ర, రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా, వేగంగా ఓటర్ల జాబితా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పార్థసారథి

రేపల్లె: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్వేను నిష్పక్షపాతంగా, వేగంగా నిర్వహించాలని అధికారులకు ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 21 వరకు ఓటర్ల జాబితా సవరణ సర్వే జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలు, మార్పులు చేర్పులు తదితర అంశాల్లో అభ్యంతరాలు ఉంటే తమకు సమాచారం అందించాలని చెప్పారు. బీఎల్వోలు వార్డుల్లో, గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యోగ జీవితంలో ఒక భాగం కావాలి

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో యోగా, ధ్యానం ప్రాముఖ్యతపై ఒక రోజు సెమినార్ మంగళవారం నిర్వహించారు. సెమినార్‌కు రిసోర్స్ పర్సన్‌గా ఆచార్య నాగార్జున యూనివర్శిటీ యోగా విభాగాధిపతి డాక్టర్ ఎ.రాధిక పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ యోగ, ధ్యానం నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని ఆమె సూచించారు. యోగా వల్ల మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గించుకోనవచ్చని తెలిపారు. దీంతో ఆత్మవిశ్వాసం, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. బాపట్ల హార్ట్ ఫుల్ నెస్ అధిపతి మానం మల్లీశ్వరి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరికి యోగా, ధ్యానం సాధన అవసరమన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆచార్యులు డి.నిరంజన్ బాబు మాట్లాడుతూ ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరగాలంటే యోగ, ధ్యానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.రామకృష్ణ, ఎం. వి.సాంబశివరావు, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవ వెంకట సుబ్బయ్యకు ఘన నివాళి



వెంకట సుబ్బయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని లంక గ్రామాల్లో చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటాన్ని విజయవంతం చేసిన మండవ వెంకట సుబ్బయ్య 20వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. స్వగ్రామం ఆముదార్లంకలో వెంకట సుబ్బయ్య స్థూపం వద్ద సీపీఎం నాయకులు నివాళులర్పించారు. బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండవ వెంకట సుబ్బయ్య, ఆయన సోదరుడు బలరామయ్య జమిందారీ వ్యతిరేక పోరాటాన్ని జయప్రదం చేసి, లంక గ్రామాల్లో భూములను నిరుపేదలకు పంచి పెట్టారని తెలిపారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య, చిట్టెమ్మ చిత్ర పటాలకు మండవ బలరామయ్య పూల మాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం సీనియర్ నాయకుడు నాగేశ్వరావు పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్, మండల కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, జి. నాగరాజు, కె.రామస్వామి, చేనేత, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డి. సత్యనారాయణ, బి.సుబ్బారావు, బి.ఏసుబాబు, మండవ బోసు, నాదెండ్ల చంద్ర శేఖర్, చినబాబు, అరుణ, గంగ, బేబి పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ పంట సాగు ధ్రువీకరణ పత్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సుమంత్‌కుమార్

కర్లపాలెం: కౌలు రైతులందరికీ పంట సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని తహసీల్దారు కేశవ నారాయణరావు ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం పంట సాగు ధ్రువీకరణ పత్రాలపై రెవెన్యూ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ.. భూ యజమానులకు సరైన అవగాహన కల్పించటం ద్వారా కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని చెప్పారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ కౌలు కార్డులు తీసుకున్న రైతుల పంటలకు మాత్రమే ఈ–క్రాప్ నమోదు చేస్తామని చెప్పారు. ఈ పంటలకు మాత్రమే వైఎస్సార్ రైతు భరోసా, నష్ట పరిహారం వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ సలీమా, ఏఈవో బాగ్యలక్ష్మి, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

6,200 మొక్కలు నాటేందుకు ప్రణాళిక

పిట్టలవానిపాలెం: సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ ఆదేశించారు. పిట్టలవానిపాలెం గ్రామ సచివాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 27 లోపు కాపునేస్తం, వాహన మిత్ర లబ్ధిదారులను ఎంపిక చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వివరాలను ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. 28న గ్రీన్ బాపట్ల కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు, శ్మశాన వాటికలు తదితర ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. మొత్తం 6,200 మొక్కలు నాటనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు. ఈఓపీఆర్డీ కె.పద్మజ, గ్రామ కార్యదర్శి ఐనంపూడి శ్రీనివాసరావు, వీఆర్వో నాగజ్యోతి ఆమె వెంట ఉన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న కమలాకర్

పెరవలి(వేమూరు): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నగదు బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు యెషిత్ హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ చైర్మన్ గణాది కమలాకర్ అన్నారు. పెరవలిపాలేనికి చెందిన ఆయన తన తల్లి గణాది వరలక్ష్మి జ్ఞాపకార్థం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులు మంగళవారం ప్రదానం చేశారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులు 13 మందికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. అలాగే ఇంటర్మీడియెట్ చేరే విద్యార్థులకు కూడా రూ.5 వేలు లెక్కన ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నగదు బహుమతులు, పాఠశాలలో ఫర్నీచర్‌కు రూ.2.50లక్షలు అందజేసినట్లు వెల్లడించారు. హెచ్ఎం సరోజిని సూచన మేరకు.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం డైనింగ్ హాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దాది సుబ్బారావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ దాసరి శ్రీనివాసరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.